క్లుప్తంగా

తాగునీటి ఎద్దడికి చర్యలు

ఇచ్చోడ: మండలంలోని తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. గురువారం మండలంలోని సిరిచెల్మలో మిషన్ భగీరథ నీటి సరఫరా, వాటర్ ట్యాంక్, బోరుబావులను పరిశీలించారు. వ్యవసాయ బోరు బావులు ఉండి భూగర్భజలాలు అడుగంటి పోయిన రైతుల కోసం ఉపాధిహామీ పథకం కింద బోరింగ్ రీచార్జ్జింగ్ కోసం ఒక్కొక్క రైతుకు రూ. 30 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. అవసరం ఉన్న రైతులు ఉపాధి సిబ్బందికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీవో సత్యానంద్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సిరిచెల్మ ఎక్స్ రోడ్డు ఎస్‌బీఐ బ్రాంచ్ ఎదుట సైబర్ నేరాలపై గురువారం కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త తరహాలో మోసం చేస్తున్నారని పాటల రూపంలో వివరించారు. బ్యాంక్ మేనేజర్ సునీల్ మనోహర్ మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్ ద్వారా బ్యాంకు వివరాలను తెలపవద్దన్నారు. బ్యాంకు అధికారుల పేరుతో వస్తున్న ఫోన్‌కాల్‌కు స్పందించవద్దన్నారు.

ముఖరా(బి)లో పశుగణన

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో గురువారం పశువైద్య సిబ్బంది సంధ్య ఆధ్వర్యంలో పశుగణన చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి పశువుల సంఖ్యను నమోదు చేసుకున్నారు. 2025 అఖిల భారత పశుగణన సందర్భంగా ప్రతీ గ్రామంలో పశుగణన సర్వే నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడవ్ మారుతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

3 నుంచి శనగ కొనుగోళ్లు నిలిపివేత

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనగ కొనుగోళ్లు ఏప్రిల్ 3 నుంచి నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. శనగ పంటను వెంటనే మార్కెట్‌యార్డుకు తీసుకువచ్చి విక్రయించుకోవాలన్నారు. ఇప్పటి వరకు 354 మంది రైతుల వద్ద 5,104 క్వింటాళ్ల శనగలను కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

'కార్మికుల కోసం పోరాడితే నక్సలైట్‌గా చిత్రీకరణ'

ఆదిలాబాద్‌టౌన్: కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న తమను కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నక్సలైట్లుగా అభివర్ణించడం సరికాదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కేంద్రం కార్మికులపై అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 42 చట్టాలను మూడు కోడ్‌లుగా చేసి ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలన్నారు.

నేడు సమావేశం

నేరడిగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు మహాజన సభ సమావేశం నిర్వహిస్తున్నట్టు సంఘ చైర్మన్ సాబ్లే కిషోర్ సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం జమ, ఖర్చులతో పాటు దీర్ఘ, స్వల్పకాలిక రుణాల వసూలు, 2024–25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: సినీ నటుడు రాంచరణ్ జన్మదినం సందర్భంగా శ్రీ అంజనీపుత్ర సేవా సమితి మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక కళావతి బ్లడ్ బ్యాంక్‌లో అభిమానులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం రిమ్స్ ఆస్పత్రిలోని సత్యసాయి ట్రస్ట్‌లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీరాం అనిల్, పర్వతనేని శ్రీనివాస్, వినయ్, వివేక్, ధీరజ్, తేజ, రమాకాంత్ పాల్గొన్నారు.

నగదు అందజేత

ఇచ్చోడ: మండలంలోని భాదిగూడ గ్రామానికి చెందిన వరుడు మడావి రవీందర్‌కు గ్రామానికి చెందిన 50 కుటుంబాల ఆడపడుచులు ఒక్కొక్కరికీ రూ. 500 వందల చొప్పున జమ చేసి గురువారం రూ. 25 వేల నగదు అందచేశారు. ఆడ మగ తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం చేస్తూ.. అండగా నిలుస్తున్న ఆడపడుచులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పాస్టర్ మృతిపై విచారణ చేపట్టాలి

ఇచ్చోడ: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని విక్టరీ పాస్టర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సదానందం డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం క్రైస్తవ సమాజానికి తీరనిలోటన్నారు. ఆయనే మృతిపై విచారణ చేపట్టి, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో నెహెమియ్య, నరేశ్ జెకర్యా, మణిక్యం, రమణ తిమోతి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

వారెవ్వా.. హలీం

- రంజాన్ మాసంలో విరివిరిగా లభ్యం
- ఏటా పెరుగుతున్న డిమాండ్
- విక్రయకేంద్రాల్లో సందడి



హలీం కొనుగోలు చేస్తున్న స్థానికులు

ఉట్నూర్‌రూరల్: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైందంటే చాలు మార్కెట్లో సందడి వాతావరణ నెలకొంటుంది. వివిధ రకాలైన వంటకాలు స్థానికులే కాకుండా, ఇతర రాష్ట్రాల వారు వచ్చి రంజాన్ వంటకాలు ఇక్కడి ప్రాంతవాసులకు అందిస్తారు. ఇందులో హలీం వంటకానికి ప్రత్యేక స్థానం ఉంది. దీంతో హలీం సెంటర్లు భారీగా వెలిశాయి. కొందరు వారెవ్వా హలీం రుచిని ఆస్వాధిస్తారు. సాయంత్రం అయిందంటే చాలు జిల్లా వ్యాప్తంగా మార్కెట్‌లో సందడి నెలకొంటుంది.

అరబ్ దేశాల సంప్రదాయం..

ఘుమఘుమలాడే రుచికరమైన హలీం అరబ్ దేశాల సంప్రదాయ వంటకం. ఇరాన్, ఇరాక్, అఫ్ఘనిస్తాన్ తదితర ముస్లిం దేశాల నుంచి దిగుమతి చేసుకున్నప్పటికీ హైదరాబాద్ హలీంకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక స్థానం ఉంది. పరిశుభ్రమైన మాంసం, స్వచ్ఛమైన నెయ్యి, గోదుమలు, పిస్తా, కాజు, బాదం, కిస్‌మిస్, మిరియాలు, లవంగాలు, యాలకులు గరం మసాల దినుసులను వేసి సుమారు 12 గంటల పాటు ఉడికించి తయారు చేసే హలీం వంటకం అందరిని ఆకర్షిస్తుంది. రంజాన్ మాసంలో మాత్రమే లభ్యమయ్యే వంటకంగా ప్రసిద్ధి చెందింది. హలీంతో పాటు రుమాలీ రోటీలో గ్రిన్ చికెన్, చికెన్ కబాబ్, తంగిడి చికెన్, షెవర్మా, కబాబ్, షేక్ కబాబ్, తందూరి చికెన్, పాయా బిర్యాని, ఖుర్బానికా మీఠా, దమకా బిర్యానీ, హైదరాబాద్ షెవర్మా, ఫ్రాంకి, షాహితుకుడా వంటి వంటకాలు నోరురిస్తూ హలీం సెంటర్లకు వచ్చేలా చేస్తాయి.



షెవర్మా



డబుల్‌కా మీఠా

తీపి వంటకాలు..

రోజా(ఉపవాసం) విరమించే సమయంలో ఎండు ఖర్జూరాలను మార్కెట్లో విక్రయిస్తున్నారు. ద్రాక్ష, బత్తాయి, పైనాపిల్, అరటి, ఆపిల్, నారింజ, దానిమ్మ పండ్లను స్వీకరిస్తారు. ఇఫ్తార్ భోజనంలో మేవేకా మీఠా, ఖుర్బానికా మీఠా, ఫిర్న, డబుల్‌కా మీఠా, బాదాం పిస్తా, ఎండు ఫలాలతో చేసిన ఖీర్ (పాయసం), సేమియాలు, పాలతో చేసే షిర్ ఖుర్మా వంటి తీపి వంటకాలను రుచిచూస్తారు.

గిరాకీ ఉంటుంది



రంజాన్ సీజన్‌లో హరీస్‌తో పాటు, హలీం, ఇతర వంటకాలకు గిరాకీ ఉంటుంది. రంజాన్ పూర్తయ్యే వరకు చాలా మంది వస్తుంటారు. స్థానికులే కాకుండా చుట్టూ పక్కల ప్రాంతాల నుంచి ఇక్కడికి చాలా మంది వచ్చి హలీం, హరీస్ , శెవర్మా రుచిచూస్తారు.

– అఫ్జాన్, హోటల్ యజమాని ఉట్నూర్

ప్రతిఒక్కరూ మెచ్చే హరీస్



రంజాన్ మాసం ప్రారంభం అయిందంటే హలీం, హరీస్‌లకు ప్రత్యేకంగా తింటాం. రంజాన్ నెలలో ఈ వంటకాలు దొరకడంతో పాటు తిరిగి పెళ్లి వంటకాల్లో మాత్రమే లభిస్తాయి. దీనిని తినడానికి ముస్లీములే కాకుండా ఇతరులు కూడా ఇష్టపడతారు.

– ముజీబ్, ఉట్నూర్

ఆయిల్‌పాం సాగు లాభదాయకం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త బీఎస్ రావు

తలమడుగు: ఆయిల్‌పాం సాగు లాభదాయకమని హైదరాబాద్ శాస్త్రవేత్త బీఎస్ రావు అన్నారు. గురువారం తలమడుగు మండలంలోని బరంపూర్, మదనపూర్ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పాం పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు తెలియజేశారు. పంట ఎదుగుదల కోసం ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం పద్ధతుల గురించి వివరించారు. ఆయిల్‌పాం సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధిక దిగుబడులను ఏ విధంగా సాధించాలలో వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సుధాకర్, హార్టికల్చర్ అధికారి క్రాంతి కుమార్, ఫామ్ డీజీఎం మల్లీశ్వరరావు, శ్రీకాంత్, రమేశ్, గణేష్, సతీష్, ఆశారెడ్డి, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ. 13 లక్షల ఆదాయం



వేలం వేస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మేజర్ గ్రామ పంచాయతీలో బుధవారం, గురువారం రెండు రోజులు పాటు నిర్వహించిన వారసంత, దినసంత వేలం ద్వారా రూ.13 లక్షల, 5 వేల రూపాయలు ఆదాయం వచ్చిందని ఈవో సంజీవ్‌రావు తెలిపారు. దినసంతకు రూ.3 లక్షల, 25 వేలు, ప్రతీ సోమవారం నిర్వహించే వారసంతకు రూ. 9 లక్షల, 80 వేల ఆదాయం వచ్చిందన్నారు. మొత్తం రూ.13 లక్షల, 5వేల ఆదాయం గ్రామపంచాయతీకి వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది జైస్వాల్ శంకర్‌లాల్, నారాయణ, ఇద్రిస్, తదితరులు పాల్గొన్నారు.

బేల వారసంత ఆదాయం రూ.8,75,100

బేల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వారసంత వేలం నిర్వహించారు. వేలంలో 5 గురు పాల్గొనగా, బండారి రాకేశ్ రూ.8,75,100కు దక్కించుకున్నాడు. ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఎంపీవో మహేశ్‌కుమార్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి సురేశ్, కారోబారి కళ్యాణ్‌కార్ గజానన్ పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న మౌనిష్ రెడ్డి

తలమడుగు: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు తండ్రి సురేశ్ జ్ఞాపకార్థం మహేశ్ యాదవ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి, గ్రామ పెద్దలు కేదారేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బరంపూర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఇలాంటి మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బరంపూర్ గ్రామానికి చెందిన చంద్రకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలు కావడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ. 5000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మల్లేష్, గంగారం, అనిల్‌రెడ్డి, మల్లారెడ్డి, రమాకాంత్, అశోక్, అనిల్, ఆశన్న పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల ప్రభుత్వ కొలువులు సాధించిన వారిని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి సన్మానించారు. జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామానికి చెందిన సవిత- రమేశ్ దంపతుల కుమార్తె గౌరీ దివ్య మహిళా శిశు సంక్షేమ శాఖలో ఈవోగా ఉద్యోగం సాధించడంతో గురువారం జిల్లా కేంద్రంలోని వారి నివాసానికి వెళ్లి శాలువా సత్కరించారు. అనంతరం తాంసి మండలంలోని బండల్ నాగాపూర్ గ్రామానికి చెందిన ముస్కు నంద- వినోద్ రెడ్డి దంపతుల కుమారుడు సిద్దార్థ్ రెడ్డి కేంద్ర పరిశ్రమ, వాణిజ్య శాఖలో ఉద్యోగం సాధించడంతో వారి నివాసానికి సైతం వెళ్లి సన్మానించారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సతీశ్

నేరడిగొండ: చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్, చైల్డ్ హెల్ప్‌లైన్ అవగాహన కల్పించారు. పిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలన్నారు. హక్కులకు ఎలాంటి భంగం కలిగిన 1098 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ చిన్నపిల్లల పెళ్లి చేయడంతో జరిగే అనర్థాలు, పోషకాహార లోపం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రజిత, డీసీపీయూ సోషల్ వర్కర్ రవికాంత్, ష్యూర్ ఎన్‌జీవో సభ్యులు నరేందర్, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. గురువారం మండలంలోని అందునాయక్‌తండా గ్రామంలోని ప్రజలు, యువతతో సమావేశమయ్యారు. గంజాయి తరలించడం, సాగు చేయడం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు బ్యాంకు వివరాలు అడిగితే తెలియజేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై దుబ్బాక సునీల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాపురెడ్డి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ జూనియర్ మున్సిఫ్ కోర్టు నూతన ఎన్నికలను గురువారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా బాపురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జైవంత్‌రావు, ఉపాధ్యక్షుడిగా బానోత్ జగన్, కోశాధికారిగా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా చీమ నాయక్, స్పోర్ట్స్ సెక్రటరీగా తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా వసంత్‌రావు, రామారావులను ఎన్నుకున్నారు. ఎన్నికలకు అధికారిగా అశోక్ వ్యవహరించారు.

ఆవును రక్షించిన స్థానికులు

తాంసి: మండల కేంద్రంలో తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ వాల్వ్ గుంతల్లో గురువారం ఆవు పడిపోయింది. అందులోనుంచి బయటకు రాలేక నరక యాతన అనుభవించింది. ఆవును గుర్తించిన స్థానికులు తాడు కట్టి అతికష్టం మీద గుంత నుంచి బయటకు తీశారు. గుంత పైన పంచాయతీ సిబ్బంది సిమెంట్ రింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ఆవు పడిందని ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన బాజీరావు బాబా సప్తాహం

బేల: మండలంలోని మశాల(బి) గ్రామంలో వారం రోజులుగా కొనసాగిన ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహ ముగింపు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా బాజీరావు బాబా చిత్రపటంతో పల్లకి ఊరేగించారు. అనంతరం బాజీరావు బాబా ఆలయ ఆవరణలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో మాజీ వైఎస్ ఎంపీపీ బండి సుజాత సుదర్శన్, దోటే ఈశ్వర్, బుబన్ రమేశ్, మార్కండి పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్

బేల: మండల కేంద్రంలోని మదీన మసీదు ప్రాంగణంలో గురువారం ముస్లిం సోదరులకు మాజీ ఎంపీపీ కుంట రఘుకుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆయన ముస్లిం సోదరులకు పండ్లు, ఫలాలు తినిపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాక్రే గంభీర్, ప్రమోద్‌రెడ్డి, ఎజాజ్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే ఏదైనా సాధించవచ్చు

బోథ్: యువత కష్టపడితే ఏదైనా సాధించవచ్చని బోథ్ సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. బోథ్ మండల కేంద్రానికి చెందిన శివరాజ్, ప్రసంజయ్‌లు నేవీ ఉద్యోగానికి ఎంపిక కాగా, వారికి గురువారం పోలీస్‌స్టేషన్‌లో శాలువాతో సత్కరించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

నార్నూర్: మండలంలోని ఎంపల్లి గొండుగూడలోని శ్రీ అంజనేయస్వామి ఆలయంలో గురువారం ఆదివాసీలు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. గ్రామపటేల్ పెందూర్ అమృత్‌రావు మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పడాలని పూజలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పెందూర్ దాదిరావు, పెందూర్ రాము, కొట్నాక్ దేవిదాస్, పూసం జంబిరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మిస్తున్నారు. దీంతో మండల కేంద్రానికి వచ్చిపోయే వారు ఇందిరమ్మ మోడల్ ఇంటిని ఆసక్తిగా గమనిస్తున్నారు.

మహిళలకు వడ్డీలేని రుణాలు

బోథ్: బోథ్ మండల మహిళా సమాఖ్య పరిధిలోని 42 గ్రామ సంఘాల పరిధిలో 2024 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి 2025 జనవరి నెల 31 వరకు 10 నెలలకు సంబంధించి వడ్డీ లేని రుణాలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందని బోథ్ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తోడిశెట్టి ప్రమీల తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 17 మండలాలకు బోథ్ మండలం అత్యధికంగా 650 స్వయం సహాయక సంఘాలకు ఒక కోటి 13 లక్షల 87 వేల మంజూరైందన్నారు.


ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి

నార్నూర్: ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత అన్నారు. గురువారం మండలంలోని రాజులగూడ గ్రామంలోగల సుమన్‌బాయి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన ఆర్యవైశ్య మహాసభ నూతన జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన చింతవార్ రాజేశ్వర్‌తో పాటు కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

జిల్లా కార్యవర్గం..

ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చింతవార్ రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా జనగం దీన్కర్, కోశాధికారిగా బోనగిరి అనంత్ కుమార్, కార్యనిర్వాహన కార్యదర్శి చంద్రకాంత్, ఉపాధ్యక్షుడిగా కొమ్మవార్ మనోజ్, పడిగేలా రాజేష్, ప్రకాశ్, బునం రాజేశ్వర్, నాగ్‌నాథ్, దెబ్బటి ఉల్లాష్, లోకుల రమేశ్, కోటగిరి రాజేష్, రాయిపల్లి పవన్, కార్యదర్శులుగా భూపతి, అముల్ గుండావార్, దీకొండ అజయ్, బట్టువార్ కపిల్, రాపల్లి మధుకర్, ఇందెలవార్ శ్రీనివాస్, నారాయణలను ఎన్నుకున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో నాయకులు

తాంసి: భీంపూర్ మండల బీఆర్‌ఎస్ నాయకులను భీంపూర్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బోథ్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన నాయకులను గురువారం తెల్లవారుజామున లక్ష్మీపూర్ గ్రామం వద్ద అదుపులోకి తీసుకోని స్టేషన్‌కు తరలించారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ముట్టడికి బయలుదేరిన సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు మడావి లింబాజీ, నాయకులు వినోద్, అశోక్, బండ్‌లను అరెస్ట్ చేశారు.

సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

తలమడుగు: సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సహకార సంఘం చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మహా జనసభ నిర్వహించారు. సీఈవో శ్రీనివాస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్రిమార్ట్ అమ్మకాలు కొనుగోళ్లుతో పాటు లావాదేవీలను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కర్షక మిత్ర రుణాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గోదాముల నిర్మాణంతో సంఘానికి లాభదాయకమన్నారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ పద్మాకర్ రెడ్డి, డైరెక్టర్లు మనిరామ్ జాదవ్, సల్ల సుధాకర్, గంగారాం, ఆశమ్మ, శ్రీనివాస్ రెడ్డి, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చిన్నారులకు చేయూత

నార్నూర్: గాదిగూడ మండలంలోని దాబా(కే) గ్రామానికి చెందిన అనాధలైన దేవరావు, రాజేశ్వరి చిన్నారులకు హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజబెత్ గ్రంథాలయం వ్యవస్థాపకుడు, హెడ్‌కానిస్టేబుల్ దుర్వ సంతోష్ గురువారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఐదేళ్ల క్రితం తల్లి, వారం రోజుల క్రితం తండ్రి మరణించడంతో చిన్నారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ప్రతిఒక్కరూ మానవత దక్పథంతో ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట పెందూర్ సంతోష్, తదితరులు ఉన్నారు.

పోషకాహార కిట్లు అందజేత

బేల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో గురువారం క్షయ వ్యాధిగ్రస్తులకు లోక్ భారతి ఎడ్యుకేషన్ సొసైటీ తరపున పోషకాహార కిట్లను జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి వంశీకృష్ణ అందజేశారు. ఆయన మాట్లాడుతూ బేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 23 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు అందజేయడం అభినందనీయమన్నారు.

కేసీఆర్‌ను కలిసిన జాగృతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్‌రావు మాజీ సీఎం కేసీఆర్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మెదక్ జిల్లాలోని ఎర్రవల్లి ఫాంహౌస్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో జాగృతి సంస్థ బలోపేతం, చేపట్టిన కార్యక్రమాల వివరాలను కేసీఆర్‌కు వివరించారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

నేరడిగొండ: వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సద్దాం అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 29 నిక్షయ్ పోషన్ కిట్లను పంపిణీ చేశారు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తీవ్రమైన వడగాల్పులు వచ్చినప్పుడు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్లు సంతోష్, స్వర్ణలత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక

ఉట్నూర్‌రూరల్: ఇటీవల వెలువడిన నవోదయ ఫలితాల్లో ఉట్నూర్ మండల కేంద్రంలోని శాంతినగర్‌కి చెందిన కొమ్ము రవి కుమారుడు కొమ్ము జోయల్‌రాజ్ 6వ తరగతిలో సీటు సాధించాడు. ఉట్నూర్ పట్టణ కేంద్రంలోని సన్‌షైన్ పాఠశాల చదువుతున్న విద్యార్థి కాగజ్‌నగర్ నవోదయ పాఠశాలలో సీటు సాధించడంపై కుటుంబ సభ్యులు, పాఠశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

అగ్నివీర్‌కు ఎంపిక

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన వొర్నీ విష్ణు వర్ధన్, దనగారి హరీష్, ముఖిత్ అహ్మద్, దేగామా గ్రామానికి చెందిన పోరెడ్డి సాయితేజ గురువారం ప్రకటించిన అగ్నివీర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఆర్మీ ఉద్యోగాలు సాధించారు. వీరిని గ్రామస్తులు అభినందించారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ క్రాస్ రోడ్డు వద్ద ఆటో బోల్తాపడి పలువురు గాయపడ్డారు. మండలంలోని ఆందుగూడ గ్రామానికి చెందిన కోవ రఘునాథ్ కుటుంబం గురువారం రాత్రి మాడగూడ గ్రామానికి ఆటోలో వెళ్లారు. తిరిగి వస్తుండగా దేగామ మూల మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. యువకుడు కోవ దినేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలు కావడంతో బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. దినేష్‌ను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామంలో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో రూ. 5 లక్షలతో సీసీరోడ్డు పనులను బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి ప్రారంభించారు.